


30న రామతీర్థంలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 30వ తేదీన రామతీర్థంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు రామతీర్థం సేవా పరిషత్ వ్యవస్థాపకులు జ్యోతిప్రసాద్ తెలిపారు.గురువారం స్థానిక దేవస్థానం ఆవరణలో గిరి ప్రదక్షిణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామతీర్థం ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుండి 7.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనాలు వుంటాయని, శ్రీరామస్వామి వారి దర్శనం చేసుకోవచ్చునని చెప్పారు. తర్వాత కొండ మెట్ల వద్ద మెట్లోత్సవం నిర్వహించి, గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే లోకం మాధవితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి తిరుమరెడ్డి శ్రీనివాసరావు, అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, గోపాలం, సూపరింటెండెంట్ రామారావు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకునేదెప్పటికి?

అందని తుపాను నష్టపరిహారం

ఆశగా ఎదురు చూస్తున్న రైతన్న

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది అకాల వర్షాలు, తుపాన్ల కారణంగా వివిధ పంటలు నష్టం భారీగా వాటిల్లింది. అయినప్పటికీ ఆదుకునేందుకు ప్రభుత్వం ఇంకా ముందుకు రాలేదు. దీంతో, రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. అక్టోబర్ చివర వారంలో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల 6904 ఎకరాల మేర పంట నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా వరి ఉంది. పలుచోట్ల కోతదశ, మరికొన్నిచోట్ల పొట్టదశలో ఉన్న వరిచేలు నీట మునిగాయి. మొక్కజొన్న, పత్తి, తదితర పంటలు కూడా దెబ్బతిన్నాయి.

అంతకు ముందు అక్టోబర్ ఒకటో తేదీ నుంచి వరుసగా నాలుగు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు, ఈదురుగాలులకు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీగా ముప్పువాటిల్లింది. అత్యధికంగా ఉద్యాన పంటలకు 822 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మరో 333 ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల పొలాల గట్లు కూడా దెబ్బతిన్నట్టుగా సమాచారం. అప్పట్లో రైతులకు జరిగిన నష్టాలపై ఆదుకుంటామంటూ ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం నేడు ఆచరణలో కనికరం చూపడం లేదు. నష్టం జరిగి రెండు నెలలు కావచ్చింది. అయినా పరిహారం చెల్లింపుపై నోరు మెదపడం లేదు. అప్పట్లో ఈదురుగాలులకు అత్యధికంగా 265 ఎకరాల్లో అరటి చెట్లు, మరో 84 ఎకరాల్లో బొప్పాయి మొక్కలు నేలకొరిగాయి. 8ఎకరాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ పంటల విషయానికి వస్తే... వరి 219 ఎకరాల్లోనూ, మొక్కజొన్న 47 ఎకరాల్లోనూ, పత్తి 68 ఎకరాల్లోనూ నీట మునిగాయి.



మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో నీటమునిగిన వరిచేను (ఫైల్)

వరి అత్యధికంగా మెంటాడ మండలంలో 148 ఎకరాల్లో నీట మునిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఉద్యాన పంటలు మొత్తంగా 44 గ్రామాల్లో 329 మంది రైతులకు నష్టానికి గురయ్యారు. ఇందులో బొబ్బిలి మండలం కొత్తపెంట గ్రామంలోనూ, పూసపాటిరేగ, మెంటాడ మండలాల్లోనూ ఎక్కువ నష్టం వాటిల్లినట్టు ఉద్యాన శాఖ గుర్తించింది. బొబ్బిలి మండలంలోని మూడు గ్రామాల పరిధిలో 154మంది రైతులు 85 ఎకరాల్లో అరటి పంట నష్టపోయారు. పూసపాటిరేగ మండలంలో పది గ్రామాల పరిధిలో 52 ఎకరాలు, మెంటాడ మండలంలో 52 ఎకరాలు, గంట్యాడ మండలంలో ఆరు గ్రామాల్లో 22 మంది రైతులకు చెందిన 23 ఎకరాల్లో అరటి పంట నేలకొరిగింది. నెల్లిమర్ల మండలంలో 1.2 ఎకరాలు, చీపురుపల్లి మండలంలోని 2 రెండు గ్రామాల పరిధిలో 25ఎకరాలు, ఎస్.కోట మండల పరిధిలోని రెండు గ్రామాల్లో ఐదు ఎకరాలు, గరివిడి మండలం బాగువలసలో 2.5 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు ఇప్పటికే పంటల బీమా పొందిన రైతులకు నష్టపరిహారం అందే అవకాశం ఉంటుంది. అయితే, ప్రతి ఎకరా విస్తీర్ణంలో 33 శాతానికిపైగా నష్టం జరిగితేనే బీమా వర్తింపే షరతు కూడా అమల్లో ఉంది. దీనికి తోడు ఈ ఏడాది పంటల బీమా ప్రీమియం చెల్లింపు నుంచి ప్రభుత్వం పూర్తిగా తప్పుకోవడంతో రైతులు తమ పంటలకు ఇన్సూరెన్స్ కూడా చేయించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే ఆదుకోవాల్సి ఉందని రైతులు, ఏపి రైతు సంఘం నాయకులు చెబుతున్నారు.

స్లాబు వేస్తే పథకం వర్తించదా?

ఇళ్ల సర్వేలో పేదలకు ఝలక్ ● ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - జామి

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. ఇప్పటివరకు ఏ ఒక్కరికీ గృహ నిర్మాణ పథకం మంజూరు చేయలేదు. తాజాగా గృహ లబ్ధిదారుల గుర్తింపునకు సర్వే చేపట్టిన విషయం విదితమే. కానీ ఆ సర్వేలో ఎప్పటి నుంచో ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలకు మాత్రం నిరాశ ఎదురైంది. గత వైసిపి ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం ప్రారంభించినా, ఎన్నికల నియమావళి రావడం, ఇతరత్రా కారణాలతో వారికి అప్పటి ప్రభుత్వం పథకం మంజూరు చేయలేదు. దీంతో అప్పులు చేసుకొని మరి అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణాలు సాగిస్తూ వచ్చారు. రాబోయే కొత్త ప్రభుత్వంలోనైనా గృహ నిర్మాణ పథకం వర్తిస్తుందని ఆశ పడ్డారు. ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత గృహ నిర్మాణ లబ్ధిదారుల గుర్తింపునకు చేపట్టిన సర్వేలో అధికారులు స్లాబు స్థాయిలో ఉన్న వారిని గుర్తించబోమని చెప్పడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మాధవరాయమెట్టలో ఇంటి ముందు ఆవేదన వ్యక్తంచేస్తున్న మరలమ్మ

మండలంలో 1156 మందిని లబ్ధిదారులుగా అధికారులు గుర్తించారు. జామి మేజరు పంచాయతీ మాధవరాయమెట్టకు చెందిన దళిత మహిళ కోలుదొబ్బు మరలమ్మ ఏడాదిగా గృహ నిర్మాణం పథకం మంజూరు కాలేదు. కూలీ పనులు చేసుకుని అప్పులు చేసి మరి ఇల్లు స్లాబు వరకు పూర్తి చేసుకుంది. ప్లాస్టింగులు, తలుపులు, విద్యుత్ సౌకర్యం కావాలంటే రూ.లక్షల్లో అవసరం. తీరా ఇళ్ల సర్వేలో తమ ఇంటిని గుర్తించలేదని, ఆ తరువాత చూస్తామని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఒక్క మరలమ్మే కాదు. చింతాడ గ్రామానికి దాసరి సన్యాసమ్మది ఇదే పరిస్థితి. ఇలా మండలంలో వందల నిరుపేదలు గృహ నిర్మాణ పథకం అందుతుందో? లేదో అన్న భయాందోళనలో ఉన్నారు.

జామి హౌసింగ్ ఎఇ వెంకటరావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా, స్థలం లేని వారి గురించి, ఇంటి స్లాబు వేసుకున్న వారి గురించి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయయూ తీసుకోలేదని చెబుతున్నారు. కేవలం స్థలం ఉండి ఇల్లు నిర్మించుకుంటామన్న వారినే సర్వేలో గుర్తించామని తెలిపారు. వీరికి త్వరలో పథకం మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పేదలు గృహ నిర్మాణ పథకం మంజూరుకు ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది.



చింతాడలో గ్రామంలో స్లాబ్ స్థాయిలో సన్యాసమ్మ ఇల్లు

పలు గంజాయి కేసుల్లో

నిందితుడిపై పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

చట్టాన్ని తరుచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతూ విజయనగరం జిల్లాలో గంజాయి రవాణాలో 'కింగ్‌పిన్'గా వ్యవహరిస్తూ నిందితుడిగా పఠాన్ బాషా అలీ (31) పై అత్యంత కఠినమైన 'పిట్ ఎన్‌డిపిఎస్' చట్టాన్ని ప్రయోగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా, ఆమదాలవలస మండలం, కొత్తవీధికి చెందిన ప్రస్తుతం విజయనగరం పట్టణంలోని పూల్ బాగ్ లో నివాసం ఉంటున్నాడని తెలిపారు. ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా గురువారం అతడిని నిర్భందించి, విశాఖపట్నం కేంద్ర కారాగానికి తరలించామని తెలిపారు. పఠాన్ బాషా అలీ చెడు వ్యసనాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ వ్యవస్థీకత నేరగాడిగా మారాడని పోలీసులు గుర్తించారు. గత నాలుగేళ్లలో విజయనగరం జిల్లా గంట్యాడ పోలీసు స్టేషనులో (1596.36 కిలోల) 1 గంజాయి కేసు, విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో (13.10 కిలోల) 2 గంజాయి కేసులు, బాపట్ల జిల్లా నిజాంపట్నం పోలీసు స్టేషనులో (1.5 కిలోల) 1 గంజాయి కేసులో (మొత్తం 4కేసులు) నిందితుడిగా అరెస్టు అయ్యాడని తెలిపారు. పఠాన్‌బాషా అలీ ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతున్న కారణంగా నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా పఠాన్ బాషా అలీపై 'పిట్ ఎన్‌డిపిఎస్' చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చాయన్నారు. నిందితుడు పఠాన్ బాషా అలీపై ఇప్పటికే విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో సస్పెక్ట్ షీటు ఉందని ఎస్‌పి తెలిపారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించినా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సమాజానికి ప్రమాదకరంగా మారితే ఉపేక్షించేది లేదన్నారు.

కోట్లల్లో ఖర్చు.. లక్షల్లో వసూళ్లు

21 శాతం దాటని నీటి పన్ను వసూళ్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖర్చు కొండంత వసూళ్లు గోరంత అన్న చందంగా నగర పాలక సంస్థలో నీటి పన్ను వసూళ్ల తీరు ఉంది. నీటి పన్నులు వసూళ్లు చేయడంలో నిర్లక్ష్యం కొనసాగుతోంది. నగర పాలక సంస్థలో గృహాలకు, వ్యాపార సంస్థలకు కలిపి 28,332 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఈ కుళాయిలు ద్వారా నగర పాలక సంస్థకు ఏడాదికి రూ.69.27 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మరో రెండు నెలలు ముగిస్తే ఆర్థిక సంవత్సరం కూడా ముగుస్తుంది. కానీ నీటి పన్ను వసూళ్ల లో ఎక్కడి వేసి గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఇప్పటి వరకు కేవలం 149.50 లక్షలు వసూలు అయింది. అంటే కేవలం 21 శాతం మాత్రమే. పది నెలలు కాలంలో వసూలు కాని నీటి కుళాయిల పన్నులు రానున్న రెండు నెలల కాలంలో వసూలు అవుతాయనే నమ్మకం లేదు. ఒకవైపు నగరంలో మంచి నీటి సరఫరాకు, నిర్వహణకు, కరెంటు బిల్లులకు ఏడాదికి రూ.6.29 కోట్లు ఖర్చు అవుతుంది.



ఇవి కాకుండా మోటార్ల నిర్వహణకు, ఉద్యోగుల వేతనాలకు, మరమ్మత్తులకు అంతకుమించి ఖర్చు కోట్లలో అవుతుంది. నీటి నిర్వహణకు అవుతున్న ఖర్చులో కనీసం కరెంట్ బిల్లులు చెల్లించేందుకు కూడా పన్నులు వసూలు కావడం లేదు. పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం కొంత ఉంటే , ఎవరైనా పన్ను కట్టలేదని కుళాయి కనెక్షన్ కట్ చేస్తే రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు రావడం వలన అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకుంటోంది. దీంతో ఏడాదికేడాదికి నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి.

దీనిపై అధికారులు, పాలకులు దృష్టి సారించాల్సి ఉంది. గత ఏడాది మొత్తం నీటి పన్ను వసూళ్లు కేవలం 22 శాతం అంటే రూ.129 లక్షలు మాత్రమే వసూలు అయ్యింది. గత ఏడాది బకాయితో పాటు ఈ ఏడాది కూడా మరో రూ.546కోట్లు వసూలు కావాల్సి ఉంది. మార్చి నెలాఖరులోగా ఏ మేరకు వసూళ్లు చేస్తారో వేచి చూడాల్సిందే.



కస్టోరియన్ అధికారులతో మాట్లాడుతున్న తహశీల్దార్

రైస్‌మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని రావివలసలో శ్రీ కనకదుర్గ రైస్ మిల్లు, సిరిపురంలో శ్రీ సూర్య రాజా రైస్‌మిల్లులో గురువారం తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యంతో వచ్చిన వాహనాలను వెంటనే కస్టోడియన్ ఆఫీసర్లు అనుమతించి, నిబంధనల మేరకు మిల్లర్‌కి అందజేయాలని సూచించారు. రైతుల నుంచి మిల్లర్లు అధిక ధాన్యాన్ని డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మురపాక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యాన్ని సిద్ధం చేసుకున్న రైతులకు బ్యాంకు గ్యారంటీ అందుబాటులో ఉన్న మిల్లులకు జాప్యం లేకుండా వెంటనే ట్రక్‌షీట్ జనరేట్ చేయాలని కొనుగోలు కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. గంట్యాడ మండలంలోని మిల్లులకు ఎస్.కోట, వేపాడ, ఎల్.కోట, బొండపల్లి, జామి మండలాల ఆర్‌ఎస్‌కెలను డి ట్యాగ్ చేయాలని పౌరసరఫరాల శాఖ డిపో మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో సిఎస్ డిటి ఎస్‌ఎన్‌విఎస్ మూర్తి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

193వ రోజుకు నిర్వాసితుల దీక్షలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం 193వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ తమ సమస్యను విన్నవించుకోవడానికి అన్ని తలుపులూ తట్టిన నిర్వాసితులు... చివరికి న్యాయస్థానమే శరణ్యమని భావిస్తున్నారని తెలిపారు.

ఇదివరకే సుమారు 100 మంది నిర్వాసితులు కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. వారికి అను కూలంగా తీర్పులు వస్తుండటంతో కోర్టు ద్వారానే తమకు పూర్తి న్యాయం లభిస్తుందని భావిస్తున్నామని తెలిపారు. మిగిలిన రైతులంతా కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.



కురుస్తున్న పొగమంచు

మన్యాన్ని కప్పేసిన మంచు దుప్పటి

ప్రజాశక్తి - కురుపాం

మన్యం ప్రాంతమంతా చల్లటి గాలులు అలుముకోవడంతో గిరిజన గ్రామాలు దుప్పటి కప్పుకున్నట్టుగా కనిపిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు పరిసర గిరిజన గ్రామా ల్లో గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగి ంది. తెల్లవారుజామున మూడు గంటల నుంచే మంచు కురుస్తుండడంతో ఎముకల వరకు చలి తాకుతుంది. ఉదయం 8 గంటల వరకు చలి తగ్గకపోగా, సాయంత్రం 4.30 నుంచి మళ్లీ చలితీవ్రత పెరుగుతోంది. తీవ్ర చలితో గ్రామస్తులు చలిమంటల చుట్టూ చేరి వేడి పుచ్చుకుంటున్నారు. మంచు కారణంగా రోడ్లపై మంచి పేరుకుపోవడంతో మైదాన ప్రాంతాల నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లే వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. చలి మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రాజాం

అమరావతిలో జనవరి 3వ తేదీ నుంచి జరిగే ప్రపంచ తెలుగు మహాసభలు పోస్టర్‌ను గురువారం రాజాం యువ రచయితల వేదిక సభ్యులు ఆవిష్కరించారు. విశ్వ సాహితీ కళా వేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు డాక్టర్ పెద్దింటి ముకుందరావు మాట్లాడుతూ తెలుగు భాష భవిష్యత్తు కోసం, తెలుగు భాష పరిరక్షణ కోసం గజల్ శ్రీనివాస్ పిలుపు మేరకు ప్రతి తెలుగువాడు ముందుకు రావాలని కోరారు. రాజాం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కొత్త సాయి, ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ భాష బ్రతుకాలంటే మన పిల్లలు, యువత భాషపై మక్కువ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత, రెడ్ క్రాస్ మెంబెర్ పెంకి చైతన్యకుమార్, సీనియర్ పాత్రికేయులు, వెలుగు పత్రిక సంపాదకులు మరిశర్ల గంగారావు, ప్రముఖ కళాకారులు, ఉపాధ్యాయులు కరణం శంకర్రావు, ప్రముఖ పారిశ్రామికవేత్త తెలుగు భాషాభిమాని చీమకుర్తి ప్రసాదు, మానవతా కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కోట తిరుపతిరావు, సంస్కృతాంధ్ర అధ్యాపకులు వి.సుబ్బారావు, ఆంగ్ల ఉపాధ్యాయులు రెడ్డి కాశీనాయుడు, ఉపాధ్యాయులు సాహితీవేత్త బొంతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైకాలజిస్టు సూర్యనారాయణ

మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో నేడు 'వర్క్ ఓరియెంటేషన్, సైకాలజికల్ వెల్‌నెస్' అంశంపై ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ అవగాహన కల్పించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఎంపికై తొమ్మిది నెలల శిక్షణలో ఉన్న సుమారు 500 మంది పోలీస్ ట్రైనీ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పోలీస్ వృత్తిలో నిరంతరం ఎదురయ్యే ఒత్తిడి, ప్రమాదకర పరిస్థితులు, ప్రజలతో పరస్పర వ్యవహారాలు, విధి నిర్వహణలో నిబద్ధత, మానసిక సమతుల్యం అత్యంత కీలకమని వివరించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించడం, ఒత్తిడిని సానుకూల శక్తిగా మార్చుకోవడం, ఆత్మనియంత్రణ, నిర్ణయాత్మక ధైర్యం, భావోద్వేగ బలహీనతలను గుర్తించి అధిగమించడం వంటి అంశాలపై మార్గనిర్దేశం చేశారు. అనంతరం మహిళా పోలీస్ ట్రైనీల మానసిక ఆరోగ్య స్థితిని అంచనా వేసేందుకు సైకోమెట్రిక్ పరీక్ష నిర్వహించి, అవసరమైన కౌన్సెలింగ్ సూచనలు, సలహాలను అందించారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపల్ రామచంద్ర రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అప్పారావు, సిఐ మంగవేణి, ఆర్ఐ గ్రౌండ్ ఆఫీసర్ శ్రీరామ్, డ్యూటీ ఆఫీసర్ ధర్మారావు, అసిస్టెంట్ డ్రిల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం, సాంకేతికత అందుబాటులోకి రావాలి

హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్ రాయ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వ్యవసాయ రంగంలో విజ్ఞానం, సాంకేతికత రైతులకు అందుబాటులోకి రావడం ఎంతో అవసరమని, ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, చైర్మన్ న్యాయ సేవాధికారి సంస్థ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ కోరారు. మండలంలోని గొరడలో వావిలాల బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వీకులు పండించే ఆర్గానిక్ పంటలను పండించాలన్నారు. రసాయనిక ఎరువులతో పండించే ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా ఎన్నో ఆరోగ్య సమస్యలు, రుగ్మతలు, కేన్సర్ వ్యాధి బారిన పడుతున్నామన్నారు. పోషక విలువలు కలిగిన ప్రకృతి వ్యవసాయ పంటలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జట్టు ట్రస్ట్ ప్రకృతి వ్యవసాయ పంటలపై దృష్టి పెట్టడం అభినందనీయన్నారు. దీన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆనాటి రోజుల్లో స్వాతంత్ర పోరాట యోధుడు వావిలాల గోపాల కృష్ణయ్యతో కలిసి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో సారా ఉద్యమంలో పాల్గొన్నా మన్నారు. గ్రంథాలయాల ఏర్పాటుకు వావిలాల గోపాలకృష్ణ ఎంతగానో కషి చేశారని అన్నారు. యువత విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతగానో విజ్ఞానాన్ని అందిస్తున్నా యన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ సహజ వ్యవసాయం, రసాయన రహిత పంటల సాగుపై రైతుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ఎరువులు మాకొద్దు", 'కర్మణ్యేవాధి కారస్తే' అనే పుస్తకాలను ఆవిష్కరించడంతో పాటు నాబార్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన జీవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి , జిల్లా సెషన్స్ జడ్జి ఎం బబిత, ఎల్విన్ పేట, చినమేరంగి సిఐలు హరి, తిరుపతిరావు, జట్టు వ్యవస్థాపకులు డి పారినాయుడు, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, కురుపాం ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎన్ శేఖర్, ఎంఇఒ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జి.వాసుదేవరావు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రనాథ్‌రాయ్

పిలిచారు ..అవమానించారు : మాజీ ఎమ్మెల్యే

మండలంలోని గొరడలో గురువారం నిర్వహించిన వావిలాల బాపూజీ స్మారక విజ్ఞాన వ్యవసాయ సమాచార కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఆహ్వానించి వేదిక పైకి పిలవకుండా అవమానించడం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. జట్టు ట్రస్ట్ సభ్యుల ఆహ్వానం మేరకు వచ్చిన తాను విటిడిఎ కార్యదర్శిగా ఉన్నానని తెలిపారు. ఆహ్వాన పత్రంలో తన పేరు ఉన్నా వేదికపైకి పిలవకుండా కనీసం పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటోనని మదనపడ్డారు. తన సొంత గ్రామం గొరడలో సమావేశాలు ఏర్పాటు చేసి తనను పట్టించకపోవడం పట్ల చిన్న చూపు చూడడం తగదన్నారు. గతం నుంచి ఈ ప్రాంతంలో సారా ఉద్యమం నుంచి, నేడు ప్రకృతి వ్యవసాయం వరకు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్న మాజీ ఎమ్మెల్యేకు ఇచ్చిన గౌరవం ఇదేనా అంటూ మండిపడ్డారు. ఇది గిరిజనుల పట్ల చిన్న చూపునకు నిదర్శనం అన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రాజాం

ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. డోలపేటలోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

టిడిపి జిల్లా కోశాధికారిగా గోవిందరావు

ప్రజాశక్తి-బాడంగి



టిడిపి జిల్లా కోశాధికారిగా బాడంగి మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన అడ్డా గోవిందరావు నియమితులయ్యారు. గతంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారు. పార్టీ కోసం కష్టపడిన వారిని అధిష్టానం గుర్తించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అడ్డా గోవిందరావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

ఉపాధ్యక్షులుగా 'కెంగువ'

ప్రజాశక్తి-మెరకముడిదాం



టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం ఉపాధ్యక్షులుగా బైరిపురానికి చెందిన మాజీ సర్పంచ్ కెంగువ ధనుంజయను పార్టీ అధిష్టానం నియమించింది. సామాన్య కార్యకర్త నుండి , సర్పంచ్ గా, మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగాబాధ్యతలు నిర్వర్తించిన ఆయనకు పార్టీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా ధనంజయకు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, సీనియర్ నాయకులు కోట్ల మోతిలాల్ నాయుడు, ఎఎంసి చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

జిల్లా అధికార ప్రతినిధిగా నీలాపు

ప్రజాశక్తి - భోగాపురం



టిడిపి విజయనగరం జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధిగా దిబ్బలపాలెం గ్రామానికి చెందిన నీలపు అప్పలరామిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసానికి తగిన విధంగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

అధికార ప్రతినిధిగా కొమ్మినేని

ప్రజాశక్తి - జామి



విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం టిడిపి అధికారిక ప్రతినిధిగా కొమ్మినేని శ్రీనివాసరావును ఆపార్టీ అధిష్టానం నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రి వర్యులు కొండపల్లి శ్రీనివాసరావు, కొండపల్లి కొండబాబు, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షుడు సత్తిబాబు, కొండపల్లి భాస్కర నాయుడు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రంధి అర్జున్ మహేష్, జామి మండల పార్టీ అధ్యక్షులు పోలుపర్తి స్వామి నాయుడు శ్రీనుకు అభినందనలు తెలిపారు. కొమ్మినేని గతంలో టిడిపి మండల అధ్యక్షునిగా పని చేశారు. గజపతినగరం నియోజకవర్గం అసెంబ్లీకి స్వాతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కొమ్మినేనికి అధికార ప్రతినిధి ఇవ్వడం పట్ల మండల టిడిపి అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును టిడిపి ప్రధాన కార్యదర్శి ధనియాల పైడిరాజు, కొత్తలి సూర్యరావు, ఎన్నింటి అప్పలరాజు, బండారు జగన్నాథ రావు, తాట్రాజు సన్యాసి అప్పారావు, మజ్జి వెంకట సత్యనారాయణ ఇతర టీడీపీ పార్టీ నాయకులు దుశ్శాలువతో సత్కరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - జామి

1970-80లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక మండలంలోని భీమసింగి వద్ద తోటలో గురువారం జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో టీం లీడర్ ఆర్.ఎర్నినాయుడు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు భీశెట్టి బాబ్జి, పెడతాడివాడ పాఠశాల హెచ్ఎం వి.వి.ఎ.నర్సింగరావు, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని, కుశల ప్రశ్నలతో రోజంతా సరదాగా గడిపారు. ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిల్లో ఉన్నప్పటికీ ఆత్మీయ కలయిక ద్వారా కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని అందరూ అభిప్రాయ పడ్డారు.

నెలాఖరు నుంచి కుటుంబ సర్వే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఈ నెలాఖరి నుంచి కుటుంబ సర్వే చేపడుతున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో వార్డుల ప్రకారం ప్రతి ఇంటికీ వెళ్లి సిబ్బంది వివరాలు సేకరిస్తారని చెప్పారు. సర్వేకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

నగరంలోని వైయస్సార్ నగర్ సమీపంలో రైలు కిందపడి వ్యక్తి మృతి మృతి చెందాడు. శ్రీకాకుళం రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అద్దేపల్లి వారి వీధి చెందిన కె.రమేష్ (26) నగరంలోని ఒక స్టీల్ వెల్డింగ్ దుకాణంలో పని చేస్తున్నాడు. అతనికి మద్యం అలవాటు ఉండటంతో పాటు అప్పుల పాలయ్యాడు. ఆర్థికంగా భారం తట్టుకోలేక రైలు కింద పడి ఆత్మహత్య కు పాల్పడ్డాడు . స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుడు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రైల్వే పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు

పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వైసిపి బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కూనిరెడ్డి వెంకట్రావు తన తండ్రి కూనిరెడ్డి సన్నిబాబు జయంతి సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు కడారి జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

క్రిస్మస్ పండగను పురస్కరించుకొని విజయనగరం జిల్లా ప్రజలకు, మినిస్టీరియల్ ఉద్యోగులకు, పోలీసు అధికారులకు సిబ్బందికి ఎస్‌పి ఎఆర్ దామోదర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, శాంతి, కరుణ, సోదరభావం అనే విలువలను ప్రపంచానికి చాటి చెప్పిన యేసుక్రీస్తు జన్మదినం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆశ , మానవత్వాన్ని పెంపొందించాలన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా యేసు సందేశాలను మన జీవితాల్లో అమలు చేయాలని గుర్తు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి దామోదర్ మాట్లాడుతూ - ప్రజలందరూ క్రిస్మస్ పండుగను ఆనందంగా, శాంతియుతంగా జరుపుకోవాలని, పండుగ వేళల్లో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ మరింత అప్రమత్తతతో పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. అలాగే, 24గంటలూ ప్రజాసేవలో నిమగ్నమై విధులు నిర్వహిస్తున్న జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొంటూ, వారి కుటుంబాలకు కూడా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఎస్‌పి ఎఆర్.దామోదర్ ఆకాంక్షించారు.

విజయనగరం టౌన్ : ప్రపంచ దేశాలన్నీ జరుపుకునే పండుగ క్రిస్మస్ అని రెవ : బిఎం రాజు అన్నారు. స్థానిక మరనాత విశ్వాస సమాజం ప్రార్ధనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

డెంకాడ : మండలంలోని గంట్లాం గ్రామం చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలలో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు పాల్గొని పేదలకు, విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ పాపారావు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు యాగాటి పకీర్, బొబ్బాది తాత, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం చర్చిలో ప్రసంగిస్తున్న రె.వ.బిఎం రాజు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

భోగాపురం : భోగాపురంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలను సుందరంగా అలంకరించి భక్తి శ్రద్దలతో ప్రార్ధనలు చేశారు. లింగాలవలస గ్రామంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలల్లో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు కేక్ కట్ చేసి పాస్టర్లకు, క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పండగ సందర్భంగా క్రిస్టియన్ పిల్లలకు రూ.5వేలు నగదును కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిస్మస్ పండగ ప్రేమ, శాంతి, సోదరభావాలకు ప్రతీక అని అన్నారు. అన్ని మతాల మధ్య ఐక్యత, సామరస్యత పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి పిడుగు తోటరావు, దాసరి అప్పలస్వామి, గ్రామ సర్పంచ్ బుగత లలిత, ఎఎంసి డైరెక్టర్ గరి వెంకటరమణ, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే

రాజాం: పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో ఉన్న ఆర్‌సియం చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీర్తి సందేశం బలమైన సమాజాన్ని నిర్మిస్తుందని అన్నారు. బూరాడ గ్రామంలో గల క్రిష్టాడెల్ఫియన్ ప్రార్థన మందిరంలో జరిగిన వేడుకల్లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ తలే రాజేష్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి వృద్ధులు, వికలాంగులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేగిడి వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్‌రావు, బొత్స బుద్ధుడు, అంజిరెడ్డి కళాశాల కన్వీనర్ రాంబాబు, డాక్టర్ నరేంద్ర, గులివెందుల శ్రీను, పాస్టర్స్ ఆనంద్‌పాల్, రవికుమార్, జాన్‌పాల్, డేవిడ్, సన్రైజ్ హాస్పిటల్ మేనేజర్ రాంబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బొబ్బిలి : పట్టణంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిబిఎం, ఆర్‌సిఎం, సెవెంత్ డే, బాప్టిస్ట్, లూథరన్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లూథరన్ చర్చిలో పాస్టర్ జాన్ విక్టర్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో హాజరైన వారికి జెసి రాజు దంపతులు బహుమతులు పంపిణీ చేశారు. అతిథులను సత్కరించారు.



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

బాడంగి : బాడంగి మండల కేంద్రంలో క్రిస్మస్ వేడుకలను గురువారం సర్పంచ్ కంది రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పేదలకు పండుగ బహుమతులు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు.

రామభద్రపురం : ఆరికతోట ఎడిఎంఎం బాప్టిస్ట్ చర్చిలో ఫాస్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సుమారు వెయ్యి మంది పేదలకు అన్న, వస్త్ర దానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంకి పుష్పమ్మ, భీమయ్య, అలమండ జయప్రకాశ్, పెంకి సుధాకర్, పెంకి జార్జి ఎబినైజర్ పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ, వల్లంపూడి, బల్లంకి, ఎన్‌కెఆర్ పురం, గుడిపాల, సోంపురం గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.




బొబ్బిలి చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రిస్టియన్లు

టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు మంత్రి సత్కారం

పార్టీని అభివృద్ధి పథంలో నడిపించాలి : కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం జిల్లాకు నూతనంగా రెండోసారి జిల్లా టిడిపి అధ్యక్షులుగా నియమితులైన కిమిడి నాగార్జున, మొదటిసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ జిల్లాలో పార్టీని అభివృద్ధి పథంలో నడపాలని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వారు గురువారం మంత్రి కొడపల్లి శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. అనంతరం జిల్లాలో పార్టీ పరిస్థితి, భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారితో మంత్రి చర్చించారు. పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు తమ సిద్ధంగా ఉన్నామని, జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందే పథకాలన్నింటిలో పార్టీ క్యాడర్ కు ప్రథమ ప్రాధాన్యత దక్కేలా



నాగార్జున, వరప్రసాద్‌లను సత్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా అధ్యక్షుడిగా కిమిడి నాగార్జున సారథ్యంలో గత ఎన్నికలలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిన నేపథ్యంలో భవిష్యత్తులోనూ పార్టీ ఇదే రకమైన ఫలితాలను రాబట్టాలని, అందుకు శక్తివంచన లేకుండా జిల్లా పార్టీ యంత్రాంగం, ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి పనిచేద్దామని సూచించారు. పార్టీ కేడర్‌కు న్యాయం చేసే విషయంలో మంత్రి స్పందన పట్ల పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున ప్రధాన కార్యదర్శి ప్రసాద్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వీరితోపాటు గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు తదితరులు ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

మేమెప్పుడూ కార్యకర్తలమే

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పదవులతో సంబంధం లేకుండా తాము ఎప్పుడూ టిడిపి కార్యకర్తలమేనని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్‌తో కలిసి 'నా కార్యకర్త' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకొన్నారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మీకు ఏ ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల కారణంగా అందుబాటులో లేకపోయినా అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ ద్వారా తనను సంప్రదించవచ్చని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన కొన్ని సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడారు. అనంతరం పార్లమెంట్ కమిటీలో నూతనంగా నియమితులైన గొరపల్లి రాము, నక్కరాజు చినరాముకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకొని సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేష్‌బాబుకు పితృవియోగం

పలువురు ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు సంతాపం

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి నాయకులు, విజయనగరం మండలం జొన్నవలస ఎంపిటిసి సభ్యులు పూసపాటి రాజేష్ వర్మకు మాతృ వియోగం కలిగింది. ఆయన తండ్రి పూసపాటి లక్ష్మీ నరసింహరాజు (పిఎల్ఎన్‌రాజు, పెదబాబు) (82) గురువారం తెల్లవారు జామున తన నివాసంలో కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు కుమారుడు రాజేష్ బాబు, కుమార్తె రమణి (చంటమ్మ) ఉన్నారు. మృతి విషయం తెలుసుకున్న రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు జొన్నవలస వెళ్లి పిఎల్ఎన్ రాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజేష్‌బాబును ఓదార్చారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఫోన్‌లో రాజేష్‌బాబును పరామర్శించారు. టిడిపిలో కీలకపాత్ర పోషిస్తున్న రాజేష్‌బాబు తండ్రి చనిపోయారని తెలుసుకున్న పలువురు



లక్ష్మీనరసింహరాజు (ఫైల్)

ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జొన్నవలస చేరుకొని రాజేష్‌బాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజేష్‌బాబును పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, నాయకులు ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, మాజీ గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొద్దల నర్సింగరావు, సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, చెల్లూరు సర్పంచ్ కల్లేపల్లి ఆదినారాయణ, ఎంపిటిసి బోడసింగి శంకర్రావు, మలిచర్ల టిడిపి నాయులు తుమ్మగంటి రామారావు, కొసరి శివ, మాజీ సర్పంచ్ సుంకరి రామానాయుడు, సుంకర పైడిరాజు, సుంకర సీతారాం, గుండాలపేట సర్పంచ్ కంది జగదీశ్వరి, శ్రీను, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, చిల్లపేట సర్పంచ్ ప్రతినిధి కోదండరాం, నడుపూరి రాంబాబు, కొండకరకాం మాజీసర్పంచ్ పాండ్రంకి గౌరినాయుడు, మాజీ ఎంపిటిసి రాంబాబు తదితరులు ఉన్నారు.

నెల్లిమర్లలో 'బైరెడ్డి' వర్ధంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కీర్తిశేషులు బైరెడ్డి సూర్యనారాయణ వర్ధంతి నెల్లిమర్లలో గురువారం నిర్వహించారు. స్థానిక బైరెడ్డి సూర్య నారాయణ కళ్యాణ మండపంలో ఆయన కుమారుడు మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగేశ్వరరావు, లీలావతి ఆధ్వర్యంలో బైరెడ్డి 31వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు.



బైరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న కడగల ఆనంద్‌కుమార్

ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బైరెడ్డి సూర్యనారాయణ నిరాడంబర జీవితాన్ని గడిపి సర్పంచ్ స్థాయి నుంచి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎదిగారని కొనియాడారు. గ్రామాన్ని, జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించి ఎవరికి ఏ కష్టం, అవసరం వచ్చినా వెంటనే స్పందించి సహాయ సహకారాలు అందంచేవారని గుర్తు చేశారు. టిడిపిని నెల్లిమర్లతో బాటు గ్రామాల్లో విస్తరించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పల నాయుడు, క్లస్టర్ ఇంచార్జి అట్టాడ శ్రీధర్, మాజీ సర్పంచ్ గురాన అసిరినాయుడు, నడిపేన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పలరాజు అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి-మెంటాడ

నిరంతరం ప్రజల పక్షాన పోరాడిన సిపిఎం అనకాపల్లి జిల్లా నాయకులు అప్పలరాజుపై పీడీ యాక్టు ప్రయోగించి అరెస్టు చేయడం హేయమైన చర్యని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కన్వీనర్ తామరపల్లి సోములు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు రాకోటి హరికృష్ణవేణి, వ్యకాస జిల్లా కమిటీ సభ్యులు ఎం.అప్పలనరసయ్య, సిహెచ్.కృష్ణవేణి ఒక ప్రకటనలో ఖండించారు. బలవంతపు భూసేకరణ, బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా అప్పలరాజు పోరాటం చేస్తున్నారని టిడిపి కూటమి ప్రభుత్వం హేయమైన చర్య తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు చేసిన వారిపైన, భూ కబ్జాదారులపైన, గంజాయి గూండాలపైన పీడీ యాక్టు పెట్టకుండా ప్రజల పక్షాన పోరాడిన నాయకుడిపై ఆ చట్టాన్ని ప్రయోగించడం ఏమిటని నిలదీశారు. వెంటనే పీడీ యాక్టును ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన అప్పలరాజును విడుదల చేయాలని డిమాండ్‌చేశారు.

మర్యాద పూర్వక కలయిక

ప్రజాశక్తి - భోగాపురం

ఇటీవల నూతంగా టిడిపిలో పదవులు పొందిన కొంత మంది గురువారం పోలిపల్లిలోని ఎపి మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి విజయనగరం పార్లమెంట్ అధికార ప్రతినిధి తాడ్డి సత్యనారాయణ, కార్యదర్శి చందక గౌరీలు ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఐక్యతతో పని చేయాలని కర్రోతు సూచించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ మండల అప్పారావు, చందక చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఒకే గ్రామంలో ఏడు చెరువుల ఆక్రమణ

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కిల్తంపాలెంలో ఏడు చెరువులు ఆక్రమణకు గురైనట్లు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి కృష్ణమూర్తినాయుడు ఆరోపించారు. మండలంలోని కిల్తంపాలెం పంచాయతీలో ఆక్రమణకు గురైన చెరువులను చెరువుల పరిరక్షణ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే గ్రామంలో ఏడు చెరువులు ఆక్రమణకు గురైనా అధికారుల దృష్టికి రాలేదంటే అక్కడి పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్వేయరు, విఆర్ఒ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆర్ఐ, ఇరిగేషన్ ఇంజినీర్, ఇఒపిఆర్‌డి క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదా? అని నిలదీశారు. తహశీల్దార్, ఎంపిడిఒలకు వాస్తవ పరిస్థితి తెలుసుకోకుండా ఎందుకున్నారని ప్రశ్నించారు. రైతుల కన్నీళ్లకు, పశుపక్షాదులు అంతరించి పోవడానికి, భూగర్భ జలాలు తగ్గిపోవడానికి, భవిష్యత్ తరాల మనుగడ ప్రమాదంలో పడటానికి కారణం అవుతున్న వీరందరికీ ఏ శిక్ష విధిస్తే సరిపోతుందని ప్రశ్నించారు. వీరికి శిక్ష పడే వరకు పోరాడుతామని తెలిపారు. 'మన ప్రజలను మనమే కాపాడుకుందాం' అనే నినాదంతో చెరువులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



కిల్తంపాలెంలో చెరువులను పరిశీలిస్తున్న పరిరక్షణ బృందం సభ్యులు